# నియామకాల్లో హోంగార్డుల కోటా పెంచాలి

## డీజీపీకి విన్నవించిన హోంగార్డుల సంక్షేమ సంఘం

**ఈనాడు, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పోలీసు నియామకాల్లో హోంగార్డుల కోటాను 10 శాతం నుంచి 20 శాతానికి పెంచాలని ఆంధ్రప్రదేశ్ హోంగార్డుల సంక్షేమ సంఘం ప్రతినిధులు సోమవారం డీజీపీ ఎన్. సాంబశివరావుకు వినతిపత్రం అందించారు. విజయవాడలోని డీజీపీ కార్యాలయంలో వారు ఆయన్ను కలిశారు. హోంగార్డులకు పోలీసు ఉద్యోగాలకు వయోపరిమితిని 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల వరకూ పొడిగించాలని కోరారు. హోంగార్డు సంక్షేమ నిధిని రూ.20 నుంచి రూ.200కు పెంచాలని, ఆర్టీసీ బస్సు పాసులు మంజూరు చేయాలని కోరారు. డీజీపీని కలిసిన వారిలో ఏపీ హోంగార్డుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.గోవిందు, ప్రధాన కార్యదర్శి ఏవై.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.